ప్రజాశక్తి

శనివారం 20 ఏప్రిల్ 2024

I

అల్లూరి సీతారామరాజు

ఇటుకల పండగ సందడి

ప్రజాశక్తి-హుకుంపేట: మన్యంలో ఇటుకల పండగ సందడి మొదలైంది. ఏజెన్సీ ప్రాంతంలో సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతి రూపంగా ఈ పండుగను గిరిజనులు ఆచరిస్తారు. తాత ముత్తాతల కాలం నుంచి జరుపుకుంటూ వస్తున్నారు. ఇటుకల పండగ సందర్భంగా వాహనాలను ఆపి చందాలు వసూలు చేశారు. వాహనదారులకు బొట్టుపెట్టి స్నేహపూర్వకంగా డబ్బులను అడుగుతారు. ఒకరికొకరుల నీళ్లను పోసుకుంటూ సంబరాలు చేసుకుంటారు.

కుంకుమ బొట్టు పెడుతున్న మహిళ

ఉత్సాహంగా అప్పలనర్స నామినేషన్

- సిపిఎం అరకు ఎంపీ అభ్యర్థికి మద్దతుగా భారీ ర్యాలీ
- తరలివచ్చిన ఇండియా బ్లాక్ నాయకులు, కార్యకర్తలు
- కోలాటం, థింసాతో అలరించిన గిరిజన యువతులు
- డప్పుల దరువు, మద్దతు నినాదాలతో హోరెత్తిన పార్వతీపురం

ర్యాలీలో అభివాదం చేస్తున్న సిపిఎం అరకు ఎంపీ అభ్యర్థి అప్పలనర్స, అగ్రభాగాన వి.శ్రీనివాసరావు తదితరులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / పార్వతీపురం రూరల్

అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో నామినేషన్ శుక్రవారం దాఖలు చేశారు. పార్వతీపురం మన్యం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి (కలెక్టర్) నిశాంత్ కుమార్‌కు నామినేషన్‌పత్రాలను అందజేశారు. అప్పలనర్స వెంట ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, కిల్లో సురేంద్ర ఉన్నారు. అనంతరం అప్పనర్సకు మద్దతుగా పార్వతీపురం పాత బస్టాండ్ నుంచి మెయిన్ రోడ్డు, ఆర్టీసి కాంప్లెక్స్ మీదుగా రైల్వే స్టేషన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఇండియా బ్లాక్ పరిధిలోని సిపిఎం, సిపిఐ, న్యూడెమోక్రసీ, లిబరేషన్, కాంగ్రెస్, ఆప్ ఆమ్‌ఆద్మీ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. నియోజకవర్గంలోని ఆయా పార్టీల శ్రేణులు పార్టీ జెండాలు చేతబూని, మండుటెండను సైతం లెక్కచేయకుండా కొండకోనలు, వాగువంకలు దాటుకుంటూ తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజన యువతులు, మహిళలు థింసా, కోలాటంతో సందడి చేశారు. గిరిజన సంప్రదాయ వాయిద్యాలు, డప్పుల దరువులు, అప్పలనర్సకు మద్దతుగా చేసిన నినాదాలతో పార్వతీపురం మెయిన్‌రోడ్డు మారుమ్రోగింది. ర్యాలీ అనంతరం బెలగాం రైల్వే స్టేషన్‌కు సమీపంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అధ్యక్షతన జరిగిన సభలో వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు మాట్లాడారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, భద్రాచలం మాజీ ఎంపీ డాక్టర్ మిడియాం బాబూరావు మాట్లాడుతూ సిపిఎం అభ్యర్థిగెలుపుతోనే ఆదివాసీ గిరిజనులకు న్యాయం జరుగుతుందని అన్నారు. గత పదేళ్లలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గిరిజన, రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలు చేసిందని, ఇందుకు రాష్ట్రంలోని వైసిపి, అంతకు ముందు టిడిపి ప్రభుత్వాలు కూడా వంతపాడాయని అన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో వైసిపి, టిడిపిలకు ఓటేస్తే బిజెపికి ఓటేసినట్టేనని చెప్పారు.

అప్పలనర్స గెలుపుతోనే గిరిజనులకు రక్షణ

అరకు పార్లమెంట్ అభ్యర్థి అప్పలనర్స గెలుపుతోనే గిరిజనుల ప్రాథమిక హక్కులు, చట్టాలకు రక్షణ సాధ్యమౌతుందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణ మూర్తి అన్నారు. బిజెపిని ఓడించకపోతే సగటు ప్రజానీకం మరిన్ని ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే గడిచిన పదేళ్లలో ఎదరికాన్ని పెంచారన్నారు. ఇక్కడి ఉన్న ఖనిజాన్ని సులువుగా దోచుకునేందుకు ఏజెన్సీలో పెద్దపెద్ద రోడ్లు వేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికీ తాగునీటికి కటకటలాడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు.

థింసా నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు

విద్య, వైద్య సదుపాయాలను కూడా కల్పించడం లేదన్నారు. అప్పలనర్స గెలుపు హక్కులను కాపాడుకోవడమేనని అన్నారు.

బిజెకి బుద్ధి చెప్పాలి : సిహెచ్‌ఎన్నార్

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ దేశాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెడుతున్న బిజెపికి ప్రస్తుత ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఇండియా బ్లాక్ బలపర్చిన సిపిఎం అభ్యర్థులను గెలిపించడం ద్వారా దేశ ప్రయోజనాలు, హక్కులు పరిరక్షించుకోగలమని, లేదంటే దేశం, రాష్ట్రం, ముఖ్యంగా అరకు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ప్రజలు మరింత నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికల్లో నీతికి, అన్యాయానికి మధ్య పోటీజరుగుతోందని అన్నారు. సిపిఎం అభ్యర్థి అప్పలనర్స ప్రజా సమస్యలపై పోరాడినందుకు జైలుకు వెళ్తే, బిజెపి అభ్యర్థి గీత అవినీతి, అక్రమాల కేసులో జైలుకు వెళ్లారని అన్నారు. వైసిపి అభ్యర్థి కూడా బిజెపికి తొత్తు వంటిదేనన్నారు. సిపిఐ ఎంఎల్ నాయకులు డి.వర్మ, లిబరేషన్ నాయకులు పి.సంఘం మాట్లాడుతూ పదేళ్లపాటు కార్పొరేట్లకు దోచిపెట్టిన బిజెపికి ఎన్నికల్లో తగిన గుణపాఠం నేర్పాలని అన్నారు. అప్పలనర్స గెలుపునకు ఊరూరా కదిలించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు గౌరీశంకర్ మాట్లాడుతూ బిజెపి, వైసిపి ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీలు తీరని ద్రోహంచేస్తున్నాయని విమర్శించారు. ఇటువంటి నేపథ్యంలో ఇండియా బ్లాక్ బలపర్చిన సిపిఎం అభ్యర్థిని ఎంపీగా గెలిపించాలని కోరారు.

బిజెపి సంకల్ప పత్రంలో విభజన హామీలేవి? : అప్పలనర్స

సిపిఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి పి.అప్పలనర్స మాట్లాడుతూ ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్, వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాకు నిధులు వంటివి బిజెపి ప్రకటించిన సంకల్ప పత్రంలో ఇవేవీలేవన్నారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రయోజనం కోసం బిజెపితో పొత్తుపెట్టు కుంటున్నట్టు టిడిపి, జనసేన కలిసి బిజెపితో పొత్తుపెట్టుకోవడం సిగ్గుచేటన్నారు. పాలకుల నిర్లక్ష్యంతో గిరిజనులు ఎక్కువగా చనిపోతున్నారని, వైద్య, వైద్య సదుపాయాలు కూడా తగినంతగా లేవన్నారు. తనుకు అవకాశం ఇస్తే ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఆదివాసీగా చెప్పుకుంటున్న నకిలీ గిరిజనులను పాలక పార్టీలో ప్రోత్సహిస్తున్నాయి. కొత్తపల్లి గీత కూడా నకిలీ గిరిజనురాలు కాదని గతంలో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రకటించినప్పటికీ, దబాయింపుతో పోటీ చేస్తున్నారని విమర్శించారు. కోర్టులో తాత్కాలికంగా ఉపసమనం ఉన్నప్పటికీ గిరిజనులు తగిన బుద్ధిచెప్తారన్నారు. గీత గతంలో ఆర్థిక నేరం కేసులు జైలు జీవితం అనుభవించారని, అటువంటి వ్యక్తి అదివాసీల ప్రయోజనాలు కాపాడుతామంటే ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ, సీనియర్ నాయకులు ఎం. కృష్ణమూర్తి, రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎం.సూర్యనారాయణ, శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శివర్గం, జిల్లా కమిటీ నాయకులు పాల్గొన్నారు.

నెలల తరబడి అందని జీతాలు

పస్తులుంటున్న సత్యసాయి మంచినీటి పథకం కార్మిక కుటుంబాలు

ప్రజాశక్తి -దేవీపట్నం

రంపచోడవరం ఏజెన్సీ 7 మండలాల పరిధిలోని గిరిజన, మెట్ట ప్రాంతాల ప్రజలకు నిత్యం తాగునీరు సరఫరా చేస్తున్న శ్రీసత్యసాయి మంచినీటి పథకం కార్మికులకు నెలల తరబడి జీతాలు ఇవ్వడం లేదు. దీంతో సదరు కార్మికుల కుటుంబాలు పస్తులుండాల్సిన దుస్థితి నెలకొంది. శ్రీసత్యసాయి మంచినీటి పథకం ద్వారా దాదాపు 3 లక్షల మందికి దాహార్తిని తీరుస్తున్నారు. కుట్రవాడ మంచినీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులకు సుమారు 20 నెలలు, పురుషోత్తపట్నం మంచినీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులకు 10 నెలల నుండి జీతాలు చెల్లించడం లేదు. దీంతో ఈ కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతన్నారు. జీతాలు రాకపోవడంతో కొన్ని కార్మిక కుటుంబాలు ఒక పూట తిని ఒక పూట తినక ఇబ్బంది పడుతుంటే, మరికొంత మంది కార్మికులు వడ్డీలకు అప్పులు తెచ్చి కుటుంబాలను పోషించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. జీతాలు అందకపోవడంపై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, ప్రభుత్వం ఈ పథకానికి నిధులు మంజూరు చేయలేదని చెబుతున్నారు. ఇటీవల ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి వేసవి కాలంలో మంచినీటి కొరత రాకుండా రూ.1000 కోట్లు మంజూరు చేసినట్టు పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. కాని ఆ నిధులు ఒక్క రూపాయి కూడా రాలేదని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చెబుతున్నారు. ఏది ఏమైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు స్పందించి తక్షణమే జీతాలు చెల్లించాలని సత్యసాయి మంచినీటి పథకం కార్మికులు కోరుతున్నారు.

మాట్లాడుతున్న తహశీల్దారు వెంకటరమణారావు

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి -మారేడుమిల్లి

మండలంలోని కుట్రవాడ గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ ఏ.వెంకట రమణరావు ఆధ్వర్యంలో ఓటు హక్కు వినయోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. వేసవి కాలం దృష్ట్యా వృద్ధులు, వికలాంగులకు పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమాదేవి, ఉప సర్పంచ్, మాజీ సర్పంచ్, ఆర్ఐ ఏసుబాబు, సచివాలయం సెక్రటరీ, బిఎల్‌ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు గురుకులం ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశాలకు, 6, 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 21న ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 181 సీట్లు భర్తీ నిమిత్తం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్లైన్లో హాల్ టిక్కెట్లను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ పాడేరు అసెంబ్లీ అభ్యర్థి బుల్లిబాబుకు బి.ఫారం అందజేత

ప్రజాశక్తి-పాడేరు: ఇండియా ఫోరం బలపరిచిన కాంగ్రెస్ పార్టీ పాడేరు అసెంబ్లీ అభ్యర్థి బుల్లి బాబు గురువారం రాత్రి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ షర్మిల చేతుల మీదుగా బీఫారం అందుకున్నారు. అనంతపురం పర్యటనలో ఉన్న షర్మిల బుల్లిబాబుకు బి ఫాం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి పాడేరు అసెంబ్లీ నియోజకవర్గానికి తనను అభ్యర్థిగా నియమించినందుకు గాను షర్మిలకు, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు ఖర్గేకి, సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయబోనని అత్యధిక మెజారిటీతో పాడేరులో కాంగ్రెస్ జెండా ఎగుర వేస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈనెల 25న నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో ఆదివాసీల అభివృద్ధికి కృషి చేసిందన్నారు.



షర్మిల చేతుల మీదుగా బి.ఫారం అందుకుంటున్న బుల్లిబాబు

నినాదాలు చేస్తున్న గిరిజనులు

గ్రామాల్లోనే రేషన్ సరుకులివ్వాలని గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి-అనంతగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరఫరా చేస్తున్న రేషన్ బియ్యం, సరకులు తమ ప్రాంతంలోనే ఇవ్వాలని గిరిజనులు ఆందోళన చేపట్టారు. మండలంలోని నాన్ షెడ్యూల్ రొంపల్లి పంచాయతీ చిన్నకోనెల, బూరిగా గ్రామాలకు చెందిన సుమారు 30 కుటుంబాలకు అనంతగిరి మండలం పరిధి రొంపల్లి లేదా ఎన్ ఆర్ పురం పంచాయతీ డియర్ డిపో నుండి ఆయా గ్రామలకు రేషన్ బియ్యం, సరుకులు పంపిణి చేయవలసి ఉంది. కానీ, విజయనగరం జిల్లా లోతుగడ్డ పంచాయతీ సారడవలస డిపోలో సరుకులు విడిపించు కోవాల్సి వస్తుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. రాను పోను 16 కిలోమీటర్లు కొండ కొండల నడుమ నుండి భుజంపై మోసి గ్రామాలకు చేరవలసిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి తమ గ్రామాలకు రేషన్ బియ్యం పంపిణీ చేసే వాహనంలో సరఫరా చేయాలని వార్డు మెంబర్ సోమ్మెల అప్పాలరాజు, గ్రామస్తులు సింహచలం, బి సన్యాసి రావు డిమాండ్ చేశారు. లేని పక్షాన తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు

ఊపందుకున్న నామినేషన్లు

పాడేరు అసెంబ్లీకి విశ్వేశ్వరరాజు, రమేష్‌నాయుడు దాఖలు

నామినేషన్ దాఖలు చేస్తున్న పాడేరు వైసిపి అభ్యర్థి విశ్వేశ్వరరాజు

ప్రజాశక్తి-పాడేరు

రెండో రోజు నామినేషన్ల దాఖలు ఊపందుకున్నాయి. పాడేరు అసెంబ్లీ స్థానం నుంచి శుక్రవారం వైసీపీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు, టిడిపి అభ్యర్థి కిల్లు వెంకట రమేష్ నాయుడు తమ తమ నామినేషన్లను పాడేరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి భావన వశిష్టకు అందజేశారు. టిడిపి అభ్యర్థి రమేష్ నాయుడు పార్టీ శ్రేణులతో భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్ దాఖలు చేసేందుకు కలెక్టర్ కార్యాలయానికి తరలి వెళ్లారు.

వైసిపి అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు నామినేషన్ కార్యక్రమానికి ఆ పార్టీ శ్రేణులతో భారీగా తరలివచ్చారు. వైసిపి అల్లూరి జిల్లా అధ్యక్షులు, పాడేరు శాసనసభ్యులు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, అరకు పార్లమెంట్ సభ్యులు గొడ్డేటి మాధవి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు శాసనసభ్యులు చెట్టి పాల్గుణ తదితరులు నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచార రథంలో ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ తమర్బ నర్సింగరావు, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు పీలా వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

అరకు నియోజకవర్గానికి ఆరు

అరకు అసెంబ్లీ నియోజక వర్గానికి శుక్రవారం ఆరు నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ అధికారి, ఐటిడిఏ పిఓ వి.అభిషేక్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. బిఎస్పీ అభ్యర్థిగా లకే రాజారావు ఒక నామినేషన్, బి.జె.పి అభ్యర్థి పాంగి రాజారావు రెండు సెట్ల నామినేషన్లు వేశారు. స్వతంత్ర అభ్యర్థులు సమిర్డి రఘునాధ్, సమిర్డి గులాబి, సివేరి అబ్రహం ఒక్కొక్క సెట్టు నామినేషన్లు దాఖలు చేసారు. రెండో రోజు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఐటీడీఏ కార్యాలయంలో సాగిన ప్రక్రియలో అభ్యర్థుల నామినేషన్ల పత్రాలను రిటర్నింగ్ అధికారి ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్‌కు అందజేశారు.

రంపచోడవరంలో టిడిపి అభ్యర్థి శిరీషాదేవి నామినేషన్ దాఖలు

రంపచోడవరం : రంపచోడవరం నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మిరియాల శిరీషాదేవి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ముందుగా రంపచోడవరంలోని ఓ ప్రైవేట్ రిసార్ట్స్ నుండి ర్యాలీగా బయలుదేరి స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ నుండి సంప్రదాయ కొమ్ములు నృత్యాలు, డీజే వాయిద్యాలు మధ్య భారీగా బాణసంచా పేల్చుతూ ఆర్వో కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మిరియాల శిరీషా దేవి తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ప్రశాంత్ కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ దళితులను హత్య చేసిన ఎమ్మెల్సీ అనంతబాబు అరాచకాలు అంతమయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం నియోజకవర్గం టిడిపి పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాస్, మాజీ శాసనసభ్యులు చిన్నబాబు రమేష్, మటన్ భాస్కర్, 11 మండలాలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నామినేషన్ దాఖలు చేస్తున్న రంపచోడవరం టిడిపి అభ్యర్థి శిరీషాదేవి

సోలార్ సిస్టవ్ పాడైపోయి నిరుపయోగంగా ఉన్న తాగునీటి పథకం

పని చేయని సోలార్ తాగునీటి పథకాలు

నీటి కోసం ఇబ్బంది పడుతున్న కొండరెడ్ల గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న కొండరెడ్ల గ్రామాల్లో ఐటిడిఎ ద్వారా గతంలో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ఆధారిత తాగునీటి పథకాలు మరమ్మతులకు గురై పని చేయక నిరుపయోగంగా ఉన్నాయి. ఫలితంగా ఆయా కొండరెడ్డి గ్రామాల ప్రజలు తీవ్ర తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టించుకునే నాథడే లేరు. అనేక మార్లు అధికారులకు విన్నవించినా నేటికీ సోలార్ మంచినీటి పథకాలకు మరమ్మతులు చేపట్టడం లేదు. దీంతో మోటర్లు మూలన పడి నీటి కష్టాలు తప్పడం లేదని కొండరెడ్లి గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి సోలార్ తాగునీటి పథకాలకు మరమ్మతులు చేసి వాటిని వినియోగంలోకి తేవాలని కొండరెడ్లు కోరుతున్నారు.

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి -కొయ్యూరు

మండలంలోని నడింపాలెం గ్రామ సమీపంలో శుక్రవారం పెను ప్రమాదం తప్పింది. జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో పనిచేస్తున్న ఓ టిప్పర్ చిప్స్ లోడుతో వేగంగా వెళుతున్న సమయంలో నడింపాలెం గ్రామ సమీపంలో టైరు ఊడిపోయింది. టైరు ఊడిపోయి రోడ్డు పక్కన ఉన్న జీడిమామిడి తోటల్లోకి దొర్లుకుంటూ పోయింది. దీంతో లారీ అదుపు తప్పి రోడ్డు పక్కకు వెళ్లిపోయింది. అయితే డ్రైవర్ చాకచక్యంగా అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది.

సీలేరులో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ప్రజాశక్తి-సీలేరు

భానుడు భగభగ మండిపోతున్నాడు. సూర్య ప్రతాపానికి జీకే వీధి మండలం సీలేరులో గురువారం 42 డిగ్రీలు ఉష్ణోగ్రత ఉండగా, శుక్రవారం 43 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. శుక్రవారం ఉదయం 11.39 గంటలకు 39 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు కాగా, మధ్యాహ్నం 12.40 గంటలకు 41 డిగ్రీలకు, మధ్యాహ్నం 1.23 గంటలకు 43 డిగ్రీలకు ఉష్ణోగ్రత చేరుకుంది. సాయంత్రం 4.40 గంటల వరకు 43 డిగ్రీల ఉష్ణోగ్రత నిలకడగా కొనసాగింది. 4.45 గంటలకు 42 డిగ్రీలకు తగ్గింది. శుక్రవారం నాటి ఎండ వేడి, వడగాలులకు ప్రజలు తీవ్ర భయాందోళన గురయ్యారు. సాయంత్రం వరకు జనం రోడ్ల పైకి రాలేదు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఎండ వేడి రోజు రోజుకి పెరుగుతుండడంతో దినసరి కూలీలు బయట పనులకు వెళ్లలేని దుస్థితి నెలకొంది. వృద్ధులు, చిన్నపిల్లలు వడగాల్పులకు తాళలేక సతమతమవుతున్నారు.

జన సంచారం లేక నిర్మానుష్యంగా ఉన్న సీలేరు మార్కెట్ రోడ్డు

వ్యయ పరిశీలన పారదర్శకంగా ఉండాలి

ఎన్నికల వ్యయ పరిశీలకులు సంజీవ్ గాంధీ

ప్రజాశక్తి-నక్కపల్లి: ఎన్నికల వ్యయ పరిశీలన, సంబంధిత అధికారులు అత్యంత పారదర్శకంగా చేపట్టాలని పాయకరావుపేట నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎన్.సంజీవ్ గాంధీ సూచించారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల వ్యయ పరిశీలన బృందాలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. డబ్బు, మద్యం వంటి ప్రలోభాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, నిఘా కోసం ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ ఎల్లప్పుడూ పర్యవేక్షించాలన్నారు. ప్రచార ఖర్చును అభ్యర్థుల ఎన్నికల ఖర్చుగా పరిగణిస్తూ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రత్యేక పరిశీలన బృందాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో చందనాడ గ్రామానికి చెందిన పలువురు టిడిపిలో చేరారు. నక్కపల్లిలో క్రిష్ టౌన్ షిప్‌లో కూటమి అభ్యర్థి వంగలపూడి అనిత సమక్షంలో శుక్రవారం ఆ పార్టీలో చేరారు. వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, పార్టీ నాయకులు కొప్పిశెట్టి బుజ్జి, పుణ్యమంతుల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: మండలంలోని వమ్మవరం గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకుడు దోసపాత్రుని హనుమంతరావు అనుచరగణంతో తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. అనకాపల్లి పార్లమెంటరీ పార్టీ ఇంఛార్జ్ బత్తుల తాతయ్యబాబు, నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి వంగలపూడి అనిత సమక్షంలో వమ్మవరంలో తెదేపా కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలశాఖ అధ్యక్షులు అమలకంటి అబద్ధం, జానకి శ్రీను, కొప్పిశెట్టి వెంకటేష్, కోన అప్పలరాజు పాల్గొన్నారు.

వైసిపిలో చేరికలు

ప్రజాశక్తి-కొత్తకోట: రావికమతం మండలం మర్రివలస గ్రామానికి చెందిన పాతాళ నూకరాజు, పాతాళ వెంకటేష్, పాతాళ చిన వెంకటేష్‌తో సహా 20 మంది టిడిపి కార్యకర్తలు శుక్రవారం వైసిపిలో చేరారు. వీరందరినీ సాదరంగా స్వాగతం పలికిన చోడవరం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, రానున్న ఎన్నికల్లో చోడవరంలో వైసిపి విజయానికి సహకరించాలని కోరారు. మరో మారు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మర్రివలస ఎంపిటిసి సభ్యులు లోవరాజు, కొత్తకోట ఉప సర్పంచ్ పందల దేవ, స్థానిక వైసీపీ నాయకులు రాముడు, తదితరులు పాల్గొన్నారు

నిలిచిన రోడ్డు నిర్మాణ పనులు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో కొడవటిపూడి గ్రామ శివారు గిరిజన గ్రామమైన కోదండరామపురంలో రోడ్డు నిర్మాణ పనులు నిలిచి పోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గడిచిన మూడు సంవత్సరాల క్రితం కోటి 20 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. గుత్తేదారునికి బిల్లులు చెల్లించక పోవడంతో పనులు నిలిచిపోయాయి. అసంపూర్తిగా నిలిచిన పనులతో గ్రామస్తులు మరింత అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా రాత్రి సమయంలో గ్రామంలోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై మెటల్ వేసి వదిలేయడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి చేసిన పనులకు బిల్లులు చెల్లించి, పనులు మొదలుపెట్టాలని గ్రామ సర్పంచ్ అప్పారావు కోరారు.

ఉపమాకలో శివపార్వతుల కల్యాణోత్సవం

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని ఉపమాక (లక్ష్మణేశ్వరస్వామి దేవస్థానం) శివాలయంలో శివ, పార్వతుల వార్షిక కల్యాణోత్సవాలు శుక్రవారం ఉదయం అంకురార్పణతో ఘనంగా ప్రారంభమ య్యాయి. శివాలయం అర్చకులు మహేశ్, వేద పండితులు భగవాన్ శర్మ, పండు శర్మ ఆధ్వర్యంలో అంకురార్పణ, హెూమాలు, ధ్వజారోహణం, వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రాత్రి నక్కపల్లిలో మైలవరపు భట్ల జోగారావు ఇంటి వద్ద నిర్వహించిన ఎదురు సన్నాహ మహెూత్సవం వైభవంగా జరిగింది. ప్రముఖ వేదపండితురాలు, డాక్టర్ గొట్టుముక్కల గాయత్రీ దేవి ప్రవచనాలు భక్తులను విశేషంగా ఆకట్టు కున్నాయి. ముందుగా ఉపమాక శివాలయం నుండి కోలాట ప్రదర్శనతో శివపార్వత ల ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఆలయ చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, ఎంవీవీఎస్ఎన్ మూర్తి కుటుంబసభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పక్కాగా పాటించండి

వ్యయ పరిశీలకులు పంకజ్ సింగ్

మాట్లాడుతున్న కలెక్టర్ విజయసునీత

ప్రజాశక్తి- పాడేరు: ఎన్నికల నిబంధనలు పక్కాగా పాటిస్తూ, ఎదురయ్యే సవాళ్ళను అధిగమిస్తూ అన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు పంకజ్ సింగ్ సూచించారు. జిల్లా ప్రధాన కేంద్రం పాడేరుకు చేరుకున్న వ్యయ పరిశీలకులు సాయంత్రం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత, పాడేరు, అరకు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు జేసి భావన వశిష్ట్, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, వర్చువల్ విధానంలో రంపచోడవరం రిటర్నింగ్ అధికారి సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్‌లతో పాటు వ్యయ పరిశీలన బృంద సభ్యులతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిభందనల మేరకు వ్యయ నివేదికలు ఎప్పటికప్పుడు సిద్ధం చేయాలని, రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించాలని సూచించారు. ముందుగా ప్రధాన కేంద్రం చేరుకున్న వ్యయ పరిశీలకులు పంకజ్ సింగ్ జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీతను కలిసి ఎన్నికల నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కమేండ్ కంట్రోల్ రూమ్ కు వెళ్లి అందులో ఏర్పాటు చేసిన వివిధ ఎన్నికల విభాగాలను పరిశీలించి ఆయా విభాగాల పని తీరును, వారు నిర్వహిస్తున్న రిజిస్టర్లను పరిశీలించారు. మీడియా మోనటరింగ్, సోషల్ మీడియా, సివిజిల్, కాల్ సెంటర్, వ్యయ పరిశీలన, ఎంసిసి, బోర్డర్ చెక్ పోస్టుల వెబ్ నిర్వహణ, కమ్యూనికేషన్, ఫిర్యాదులు తదితర విభాగాలన్నిటినీ క్షుణ్ణంగా పరిశీలించి తగు సూచనలు జారీ చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యు అధికారి బి.పద్మావతి, వ్యయ పరిశీలన బృందం నోడల్ అధికారి సువర్ణ ఫణి, మీడియా, సోషల్ మీడియా, సి విజిల్, కమ్యూనికేషన్, ఫిర్యాదులు విభాగాల నోడల్ అధికారులు పి.గోవింద రాజులు, పి.రాములు, సాయి నవీన్, రమేష్ కుమార్‌రావు, ఎం.రామకృష్ణరాజు, పూర్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో కృష్ణమూర్తి ప్రథమ వర్ధంతి

ప్రజాశక్తి - ఆరిలోవ : కమ్యూనిస్టు నాయకుడు వి.కృష్ణమూర్తి ప్రథమ వర్ధంతి సభను ఆరిలోవ సిపిఎం కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు ఎ.అజశర్మ మాట్లాడుతూ, ఆదర్శ కమ్యూనిస్టు నాయకుడు వి.కృష్ణమూర్తి అని కొనియాడారు. ఆరిలోవ ప్రాంతం ఏర్పాటులో, కాలనీల్లో మౌలికవసతులు కల్పించడంలోనూ కృష్ణమూర్తి ఎనలేని కృషి చేశారన్నారు. చివరి వరకు నమ్మిన ఎర్రజెండా సిద్ధాంతం కోసం పనిచేశారన్నారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా చిత్తశుద్ధితో పనిచేశారని తెలిపారు. ఆరిలోవ ప్రాంతంలో రాజకీయాలకతీతంగా అభిమానించే వ్యక్తి కృష్ణమూర్తి అన్నారు. నేడు బిజెపి అనుసరిస్తున్న మతతత్వ, ఆర్థిక విధానాల వల్ల ప్రజానీకం పెద్ద ఎత్తున నష్టపోతున్నారని, ఈ తరుణంలో బిజెపిని, దానితో పొత్తు పెట్టుకున్న తెలుగుదేశం, జనసేనను, వైసిపిని ఓడించాలని పిలుపునిచ్చారు. ఇండియా బ్లాక్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, ఆరిలోవలో పేదలకు ఇళ్ల కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. ఆ సందర్భంలో ఆయన అరెస్టు అయి జైలు జీవితం గడిపారన్నారు. ఆరిలోవలో జూనియర్ కాలేజీ, క్రీడా మైదానం, ఇండోర్ స్టేడియం, రైతు బజార్ ఏర్పాటుచేయాలని, విమ్స్ ఆసుపత్రిని ప్రైవేటీకరణ ఆపాలని పెద్దఎత్తున పోరాడరని గుర్తుచేశారు. పిల్లలకు కులాంతర, ఆదర్శ వివాహాలు జరిపారని తెలిపారు. ఈ సభలో సిపిఎం జోన్ నాయకులు వి.నరేంద్రకుమార్, పి.శంకర్, ఎస్.రంగమ్మ, సూర్యమణి, ఐసి.నాయుడు, సత్యనారాయణ, కాంతం, శాంతి రమణమ్మ, కృష్ణమూర్తి భార్య అన్నపూర్ణ, కుటుంబ సభ్యులు మోహన్, లావణ్య, శార్వాణి, పార్టీ సభ్యులు రత్నం, గురుమూర్తి, భాస్కర్, రవణమ్మ, అప్పలనాయుడు, భూలోకరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'గంగవరం' ఆందోళన

ప్రజాశక్తి -గాజువాక : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అదాని గంగవరం పోర్టు కార్మికులు చేపట్టిన ఆందోళన శుక్రవారం నాటికి 10వ రోజుకు చేరుకుంది. ప్రధాన గేటు వద్ద కార్మికులు కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఉపాధ్యక్షులు కొవిరి అప్పలరాజు మాట్లాడుతూ, కార్మికులు శాంతియుతంగా ఆందోళన చేస్తున్నప్పటికీ యాజమాన్యం స్పందించడం లేదన్నారు. అదాని యాజమాన్యం తప్పుడు విధానాల వల్ల పోర్టు లోపల స్టీల్ ప్లాంట్ సంబంధించిన ఐరన్ ఓర్, బొగ్గు నిల్వలు ఉండిపోయానని తెలిపారు. చర్చల పేరుతో కార్మికుల మధ్య ఐక్యమత్యం చెడగొట్టడానికి యాజమాన్యం ప్రయత్నిస్తోందన్నారు. యాజమాన్యం స్పందించకపోతే పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆందోళన చేస్తున్న కార్మికులు

ఆలయ ఆభరణాలు అప్పగింత

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: నర్సీపట్నంలో మరిడీ మహాలక్ష్మీ అమ్మవారి నగలను మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు శుక్రవారం దేవాదాయశాఖ అధికారులకు అప్పగించారు. ఇటీవల మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, సన్యాసిపాత్రుడు మధ్య అమ్మవారి నగల విషయంలో మీడియా ముఖంగా వాగ్వివాదాలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దేవాదాయశాఖకు మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ సమక్షంలో ఈ నగలను అప్పగించారు.

'విశ్వోదయ'లో ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి -మాధవధార : మేఘాద్రిపేట అశోక పార్క్ సమీపంలో ఉన్న విశ్వోదయ సిబిఎస్‌సి స్కూల్లో శుక్రవారం ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు వివిధ విభాగాల్లో చేపట్టిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డిఫెన్స్ సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ మేనేజర్ నవత్కర్ ఎగ్జిబిషన్‌ను తిలకించి విద్యార్థులను అభినందించారు. విజ్ఞానశాస్త్రం, గణితం, పర్యావరణం ముడి సరుకుగా వినియోగించి ప్రాజెక్ట్ ఐ ఎగ్జిబిషన్‌లో డయాలసిస్, సింపుల్ సర్క్యూట్, మైక్రోస్కోప్, ఈవీఎం మిషన్, మోడల్ ఆఫ్ గ్లోబ్, చంద్రయాన్- 3, థర్మల్ పవర్ స్టేషన్, యానిమల్ సెల్, ప్లాంట్ సెల్, జి -ట్వంటీ, రామ మందిర్, యాక్సిడెంట్ ప్రివెన్షన్ సిస్టం, స్వాతంత్ర్య సమర యోధులు, తెలుగు, హిందీ భాష గొప్పతనాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ విద్యాసాగర్, ప్రిన్సిపల్ పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

43వ వార్డులో వివి.లక్ష్మీనారాయణ ప్రచారం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 43వ వార్డులో ఉత్తర నియోజకవర్గ జైభారత్ నేషనల్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వివి.లక్ష్మీనారాయణ శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో న్యాయాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ టార్చ్ లైట్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జై భారత్ నేషనల్ పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నోటీసు బోర్డులో స్పెషలిస్టు డాక్టర్ల వివరాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం స్పెషలిస్ట్ డాక్టర్ల పేర్లు, ఎప్పుడు వస్తారనేది సమాచారం నోటీసు బోర్డులో తెలియజేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు స్పష్టంచేశారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న స్పెషలిస్ట్ డాక్టర్ల డిఎం అండ్ హెచ్ఒ సమావేశమయ్యారు. స్పెషలిస్టు డాక్టర్ల వివరాలను ఎఎన్ఎం, ఆశ ద్వారా ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. రోగులకు మందులు ఉచితంగా ఇవ్వాలన్నారు. పబ్లిక్ హాలిడేస్ రోజున స్టాఫ్ నర్సులు ఉండేటట్లు ప్రణాళిక వేసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ బి.ఉమావతి, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ సమత, ఆర్‌బిఎస్‌కె డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జగదీష్‌ప్రసాద్, డిఎస్ఒ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

'రైల్వే వ్యాగన్'లో ఒప్పందం అమలు చేయాలి

ప్రజాశక్తి -గాజువాక : రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు కార్మికులతో యాజమాన్యం చేసుకున్న ఒప్పందాన్ని తక్షణమే అమలుచేయాలని సిపిఎం గాజువాక నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఇటీవల మృతిచెందిన రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ కార్మికుడు వి.వెంకటేష్ సంతాప సభను పనిప్రదేశంలో శుక్రవారం నిర్వహించారు. వెంకటేష్ చిత్రపటానికి జగ్గునాయుడు పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, కార్మికులకు భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్, సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, కార్మికులు కె.అవుతారు, వెంకటేష్‌రాజు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం గొట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు లేడీస్ సర్కిల్ ఇండియా టీం సభ్యులు సుమారు రూ. 20వేలు విలువ గల క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఏరియా చైర్ పర్సన్ డాక్టర్ శాంతి మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలంటే విద్యాభివృద్ధి జరగాలన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడా పరికరాలను ఉపయోగించుకొని శారీరకంగా, మానసికంగా ఎదగాలన్నారు. ఈ సందర్భముగా ప్రధానోపాధ్యాయులు ఆర్.సన్యాసిరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సహాయ సహకారాలు అందచేయటం ఆనందదాయకం అన్నారు. టీం సభ్యులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్వీటీ జోషి, నీలిమ మంచుకొండ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఇఇ ప్రభాకర్, పక్కనే ఎస్ఇ ప్రశాంత్‌కుమార్

ప్రజాశక్తి -సీలేరు : విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ మేనేజర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జికె.వీధి మండలం సీలేరు ఏపీ జెన్కో కళ్యాణ మండపంలో శుక్రవారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఏపీ జెన్కో ఎస్ఇ కేవీ.ప్రశాంత్ కుమార్, ఈఈ సివిల్ ప్రభాకర్ ప్రారంభించారు. వీరికి కంటి వైద్య నిపుణులు శక్తి, శశి కంటి పరీక్షలు నిర్వహించారు. ఏపీ జెన్కో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ శిబిరంలో 131 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, వారిలో 16 మందికి ఆపరేషన్ నిమిత్తం శంకర్ ఫౌండేషన్‌కు రిఫర్ చేశామని చెప్పారు. 32 మంది కంటి సమస్యలతో బాధపడుతున్నట్టు వైద్య నిపుణులు గుర్తించి కళ్ళద్దాలు వేయించుకోవాలని సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్కో ఏడిఈ వెంకట మధు, ఇంజనీర్లు ఉద్యోగులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న అగ్ని మాపక సిబ్బంది

ప్రజాశక్తి-రంపచోడవరం : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా 6వ రోజు రంపచోడవరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వాటిని నివారించే విధానాన్ని తెలియజేశారు. ఆర్ఎంఒ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, స్టాఫ్, ప్రజలు పాల్గొన్నారు. అనంతరం గెద్దాడ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ వినోదకుమార్ అధ్యక్షతన సిబ్బందికి అగ్ని మాపక వారోత్సవాలు గురించి తెలిపి, అగ్నిమాపక పరికరాలు ఉపయోగం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అగ్నిమాపక అధికారి ఎస్.గంగన్నదొర, సిబ్బంది పాల్గొన్నారు.

30న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 30న మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు జెడ్‌పి సిఇఒ ఎం.పోలినాయుడు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జెడ్‌పి చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి సమావేశం జరుగుతుందని, సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

నీతి, నిజాయితీగల సిపిఎం అభ్యర్థులను గెలిపించుకుని

ఓటు విలువను కాపాడుకుందాం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం
- కళాకారుల శిక్షణ శిబిరం ప్రారంభం

చింతూరులో ఎన్నికల ప్రచారంలో ప్రజానాట్యమండలి కళా ప్రదర్శన

ప్రజాశక్తి-చింతూరు : నీతి నిజాయితీగల సిపిఎం అభ్యర్థులను గెలిపించుకొని ఓటు విలువను కాపాడుకుందామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. ఎన్నికల నేపథ్యంలో సిపిఎం ఆధ్వర్యంలో చింతూరు మండలం తుమ్మల గ్రామంలో ఏర్పాటు చేసిన రంపచోడవరం నియోజకవర్గస్థాయి కళారూపాల శిక్షణ శిబిరాన్ని శుక్రవారం మంతెన సీతారాం ప్రారంభించారు. అనంతరం ప్రజా నాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఐవి అధ్యక్షతన జరిగిన శిబిరం ప్రారంభసభలో సీతారాం మాట్లాడుతూ ఇండియా వేదిక బలపర్చిన అరకు పార్లమెంటు సిపిఎం అభ్యర్థి పి.అప్పలనర్స, రంపచోడవరం అసెంబ్లీ సిపిఎం అభ్యర్థి లోతా రామారావులను గెలిపించడం కోసం కళాకారులు కష్టపడి పనిచేయాలని సూచించారు. ఇక్కడ సిపిఎం అభ్యర్థుల గెలుపు ఆవశ్యతను ప్రజలకు పాటలు, కళారూపాయల ద్వారా తెలియజేసి చైతన్య వంతులను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పి.మంగరాజు, జిల్లా కన్వీనర్ పద్దం రాజు, నాయకులు సిహెచ్.సుబ్బారావు, కారం కన్నారావు, సోడె దుర్గారావు, మొట్టుం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం

ఎటపాక : ప్రజా సమస్యల పరిష్కారానికి, గిరిజన చట్టాల రక్షణకై సిపిఎం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు కోరారు. మండలంలోని రాఘవపురంలో ఉపాధి హామీ కూలీలతో శుక్రవారం ఉదయం సమావేశమై మాట్లాడారు. సుత్తి కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గిరిజన సంఘం మండల కార్యదర్శి ఇరపా అజయ్ మాట్లాడుతూ జిఓ నెంబర్ 3కి చట్టబద్ధత కోసం, బోయ వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చకుండా పోరాడుతున్న పార్టీ సిపిఎం మాత్రమేనని గుర్తు చేశారు. కార్యక్రమంలో సోందే రామారావు, ఊకె బాబు పాల్గొన్నారు.

దేవిపట్నం : పోలవరం నిర్వాసితుల సమస్యలపై పోరాడే సిపిఎం అభ్యర్థులకు నిర్వాసితులు ఓట్లు వేయాలని సిపిఎం జిల్లా నాయకులు జి.వెంకట్రావు పిలుపునిచ్చారు. మండలంలోని ఇందుకూరుపేటలో సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని శుక్రవారం ప్రచారం నిర్వహించారు. దేవీపట్నం ప్రాంతంలోని రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కోసం సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు.



అడ్డతీగలలో సిపిఎం నేతల ఇంటింటా ప్రచారం

అడ్డతీగల : మండలంలోని వేటమామిడి, మిట్లపాలెం, ధాన్యం పాలెం, దుప్పుల పాలెం గ్రామాలలో సిపిఎం నాయకులు గడపగడపకు వెళ్లి సిపిఎం అభ్యర్థి లోత రామారావును గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో అడ్డతీగల మాజీ జెడ్పిటిసి పల్లాల రామలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు, సిపిఎం రాష్ట్ర నాయకులు ఏవి నాగేశ్వరరావు, జిల్లా నాయకులు ఎం రాజశేఖర్, సిపిఎం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎటపాకలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సిపిఎం నేత నాగేశ్వరరావు

22న లోతా నామినేషన్‌కు తరలిరండి

రాజవొమ్మంగి : రంపచోడవరం అసెంబ్లీ సిపిఎం అభ్యర్థి లోతా రామారావు ఈనెల 22న సోమవారం నామినేషన్ వేస్తున్నారని, ఆ కార్యక్రమానికి మండలంలోని కష్టజీవులంతా హాజరై జయప్రదం చేయాలని సిపిఎం రాజవొమ్మంగి మండల నాయకులు, చికిలింత సర్పంచ్ కొండ్ల సూరిబాబు, కొండపల్లి సర్పంచ్ జగన్నాథం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో రాజవొమ్మంగిలో ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, వివిధ సంఘాల ప్రతినిధులకు సిపిఎం బృందం ఆహ్వాన పత్రికలు అందజేసింది. కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి శ్రీను, ఎం రమేష్. పలివెల వీరబాబు, కె జగన్నాథం, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఆహ్వాన పత్రిక ఇస్తున్న సిపిఎం నాయకులు

'ప్రేమా.. నువ్వెక్కడ?' చిత్రీకరణ పూర్తి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పూర్తి సందేశాత్మకంగా రూపుదిద్దుకున్న మిని మూవీ 'ప్రేమా.. నువ్వెక్కడ?!.. షూటింగ్, పోస్టుప్రొడక్షన్ పనులను పూర్తిచేసుకుని విడుదలకు సిద్ధమైందని చిత్ర దర్శకుడు బిఎస్. చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భార్యభర్తలిద్దరూ వేర్వేరు వ్యాపకాల్లో బిజీగా ఉంటూ పిల్లల్ని కేర్‌టేకర్‌లకు వదిలేయడం, తమ పిల్లల జీవితాలకు మార్గదర్శకం లేకుండా పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులను అనాథాశ్రమాల పాల్జేయడం వంటి సమాజంలో జరుగుతున్న నేటి సామాజిక పరిస్థితులను ఇతివృత్తంగా తీసుకుని, పూర్తిగా విశాఖ కళాకారులతో చిత్రాన్ని నిర్మించామన్నారు. జిఎస్ఎన్ రెడ్డి సమర్పణలో డిఎన్ రాజు ప్రొడక్షన్‌లో గౌశే బాబు నిర్మాతగా వ్యవహరించారన్నారు. ఈ మూవీలో చలసాని కృష్ణ ప్రసాద్, కోరుకొండ రంగారావు, ఎం.సునీత, కె. జోషిత, మాస్టర్ విన్నకోట హర్ష, బండారు రాము, రాజీవ్ ప్రధాన పాత్రల్లో నటించారన్నారు.

గౌతు లచ్చన్న స్మారక భవనం నిర్మించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : స్వాతంత్రయ సమరయోధులు, సంఘ సేవకులు, సర్దార్ గౌతు లచ్చన్న స్మారక భవనం నిర్మించాలని స్థానిక నేత తోట వాసుదేవరావు ప్రభుత్వాన్ని కోరారు. గౌతు లచ్చన్న 18వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం అత్తిలి శంకర్రావు, రవీశ్వరావు, తోట వాసుదేవరావు అధ్యర్యంలో గ్రీన్‌పార్క్ రోడ్డులోని సర్దార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్దార్ గౌతు లచ్చన్న సేవలను కొనియాడుతూ, ఆయన స్మారకార్థం షీలానగర్ నుంచి అనకాపల్లి రోడ్డులో ఎక్కడైనా ఐదెకరాల స్థలంలో స్మారక భవనం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో బంటుపిల్లి కృష్ణ, గిరి జోగారావు, తోట హరికృష్ణ, జలుమూరి చిట్టిబాబు, మడ్డి ప్రసాద్, దొంపక భాస్కరరావు, శ్రీశయన యువత పాల్గొన్నారు.

విశాఖపట్నం - బెంగళూరు మధ్య

వేసవి ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : వేసవి కాలంలో ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు, ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం, ఎస్ఎంవి బెంగళూరు మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని నిర్ణయించింది. రైలు నెంబరు 08549 విశాఖపట్నం, ఎస్ఎంవి బెంగళూరు సమ్మర్ స్పెషల్ ట్రైన్ ఈనెల 27 నుంచి వచ్చేనెల 29 వరకు ప్రతి శనివారం మధ్యాహ్నం 13.15 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.30 గంటలకు ఎస్ఎంవి బెంగళూరు చేరుకుంటుంది. 08550 ఎస్ఎంవి బెంగుళూరు, విశాఖపట్నం సమ్మర్ స్పెషల్ రైలు ఈ నెల 28 నుండి వచ్చేనెల 30 వరకు ప్రతి ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు ఎస్ఎంవి బెంగుళూరులో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైళ్ళు దువ్వాడ, రాజమండ్రి, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట, కృష్ణరాజపురం మీదుగా ప్రయాణిస్తాయి.